క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన 'గూడూరి'



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గూడూరి శ్రీనివాస్, ఎంపీ భరత్ తదితరులు

సీటీఆర్ఐ: జిల్లా కలెక్టర్ మాధవీలతను రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఎంపీ మార్గాని భరత్ రామ్ డాక్టర్ గూడూరిని కలెక్టర్‌కు పరిచయం చేశారు. వారి వెంట డాక్టర్ గూడూరి తనయుడు కమల్ ఉన్నారు.

డీఈఈ సెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో సోమవారం డీఈఈ సెట్-2023 మొదటి విడత కౌన్సెలింగ్‌కు 21 మంది హాజరై ఫైనల్ అడ్మిషన్ లెటర్లు పొందారని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు డీఈఈసెట్-2023 ధ్రువీకరణ పరిశీలన జరుగుతుందని, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో బొమ్మూరులోని డైట్‌లో హాజరుకావాలని ఆయన కోరారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి

సీటీఆర్ఐ: అశ్లీల దృశ్యాలు పూర్తిగా నిషేధించాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు, మహిళ బిల్లు పెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని జాతీయ బీసీ మహిళ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 24, 25వ తేదీల్లో మహిళల రాజ్యాధికారం కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు రక్షణ కోసం ఇప్పటికీ అనేక చట్టాలు ముఖ్యంగా వరకట్న నిషేధ చట్టం, అత్యాచార, నిరోధక చట్టం, నిర్భయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, దిశా చట్టం లాంటి 19 చట్టాలు వచ్చినప్పటికీ వారిపై అత్యాచారాలు తగ్గలేదన్నారు. మహిళల రక్షణ కోసం మరిన్ని చట్టాలు తేవలసిన అవసరం ఉందన్నారు. మహిళలను చైతన్యం తీసుకుని రావాలన్నారు. ఈ సమావేశంలో శరత్‌కుమార్, సుభాషిని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

కడియం: హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ మేరకు వివరాలను కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ స్థానిక విలేకరులకు వివరించారు. వ్యసనాలకు బానిసైన ఆముదాల టైటస్ ఇమ్మానియేల్ తన ఇంట్లోనే దొంగతనం చేయడంతోపాటు భార్యపై అనుమానంతో భార్యను, మామగారిని 2018లో కడియం మండలం మురమండ గ్రామంలో గాయపరిచాడు. అప్పటి కడియం ఏఎస్ఐ ఎల్.కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుతం విచారణకు వచ్చిన ఈ కేసులో కోర్టు కానిస్టేబుల్ పి.విశ్వేశ్వరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోడి సతీష్ నాయుడు తన వాదనలను వినిపించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గామన్ బ్రిడ్జి వద్ద లారీని ఢీకొని తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బీహార్‌కు చెందిన ప్రస్తుతం సీతానగరంలో ఉంటున్న నిఖిల్‌కుమార్(19) సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన నిఖిల్‌కుమార్(19) కూలి పనులు చేసుకుంటూ సీతానగరంలో ఉంటున్నాడు. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి సమయంలో స్నేహితుడిని రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు మోటార్‌సైకిల్‌పై తీసుకువచ్చాడు. తెల్లవారు జామున మూడు గంటల సమయంలో నిఖిల్‌కుమార్ సీతానగరం వెళుతుండగా కాతేరు గామన్‌బ్రిడ్జి వద్ద ముందు వెళుతున్నలారీ సడన్ బ్రేకు వేయడంతో నిఖిల్‌కుమార్ లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు త్రీటౌన్ ఏఎస్సై భీమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం

సీటీఆర్ఐ: కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక 2వ డివిజన్‌కు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు సూరకాసుల నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ఆదిరెడ్డి వాసు తమ భవాని ఛారిటబుల్ ట్రస్టు తరపున మూడు నెలలకు సరిపడే ఖరీదైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ బాధల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వారికి మందులు అందించేందుకు ముందుకు వచ్చిన సోమును ఆయన అభినందించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పంచ్ కొడితే.. పతకమే..

- కరాటేలో సత్తా చాటుతున్న బాలికలు
- జాతీయ స్థాయిలో పలు పతకాలు కైవసం



జాతీయస్థాయి కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

ప్రకాశం నగర్: ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా ఇంకొందరు నేర్చుకుంటున్న కరాటే, కుంగ్‌ఫూలో బాలికలు రాణిస్తున్నారు. ఆయా పోటీల్లో విజయం సాధించి పతకాలు పొందుతున్నారు. కరాటేలోని సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు నేర్చుకుంటున్న వీరు ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. ప్రసుత్త సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే, కుంగ్‌ఫూ వంటి శిక్షణ వారిలోని ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు ఆపదలో ఉండేవారిని ఆదుకునేలా చేస్తుందని శిక్షకులు చెబుతున్నారు. ఐతే మిగిలిన క్రీడాలతో పోలిస్తే కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యల్లో రాణించడం అంత సులభం కాదని క్రీడా విశ్లేషకులు అంటున్నారు.

కరాటేలో పలు పతకాలు కైవసం

జాతీయస్థాయి కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్ షిప్-2023 పోటీల్లో బ్లాక్ బెల్ట్ గ్రాండ్ చాంపియన్ షిప్‌లో మొదటి స్థానంలో శ్రీలక్ష్మీలత, రెండో స్థానంలో కె.సంధ్య, మూడో స్థానంలో భవానిలు విజయం సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు. వీరు జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవారానికి చెందిన వారు. వీరితో పాటు కరాటేలో అండర్-8, అండర్-10 , అండర్-12 విభాగాల్లో సీహెచ్ సాయిదీప్, ఎ.కీర్తన, కె.హర్షల్ బంగారు పతకాలు సాధించగా, ఎ.అభిషేక్, ఎస్‌డీ అయేషా వెండి పతకాలు సాధించారు.

చదువుతోపాటు శిక్షణ

విద్యార్థులు చదువుతోపాటు కరాటే శిక్షణలో ప్రతిభ చూపుతున్నారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విజయం సాధించిన వారందరూ విద్యార్థులే. వీరందరూ ఆయా పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటునే సాయంత్రం వేళలో శిక్షణ పొందుతున్నారు. పలు పోటీల్లో పతకాలు సాధించి మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

ప్రభుత్వ తోడ్పాటు

క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ద్వారా క్రీడాలకు సంబంధించిన శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు జగనన్న క్రీడా సంబరాలు పేరుతో ఆయా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు నగదు, బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో ఇతర జిల్లాల క్రీడాకారులు ఇక్కడ బస చేసినప్పుడు భోజన వసతి దాతల సహకారంతో నిర్వహించేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడాకారులకు అల్పాహారం, మాధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌తో పాటు గుడ్డు, పాలు వంటి పోష్టికాహారం ప్రభుత్వమే అందిస్తుంది.

క్రీడలతో మంచి భవిత



కరాటేలో చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుంది. సుమారు 120 మంది నా వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేతో శరీరక ధృడంతో పాటు, మనోధైర్యం కలుగుతుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు అన్ని విభాగాల్లోను బాలురు కంటే బాలికాలే ముందజలో ఉన్నారు.

– పిల్లి అరుణ్ కుమార్, కరాటే మాస్టార్

మన లక్ష్యం.. రాజమహేంద్రవరం పైనే..

- పార్టీ విజయానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలి
- వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో ఎంపీలు బోస్, భరత్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోస్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గత ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు సరిచేసుకుని ప్రతి ఒక్క కార్యకర్త అప్రమత్తమై రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పిల్లి సుభాస్ చంద్రబోస్, భరత్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత ఎంపీ భరత్ మాట్లాడుతూ రాజమండ్రి నగరంలోని 42 వార్డు ఇన్‌చార్జులు, పార్టీ శ్రేణులంతా వైఎస్సార్ సీపీ విజయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని, రాజమహేంద్రవరం అర్బన్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయడమే మన ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇప్పటి నుంచే ఒక ప్రణాళికతో పని చేసి పార్టీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ ఏడెనిమిది నెలలు ఎన్ని పనులున్నా పక్కన బెట్టి పార్టీ కోసం, పార్టీ విజయం కోసం పని చేయాలని ఎంపీ భరత్ కోరారు.

అందరూ సంఘటితం కావాలి : పిల్లి సుభాష్ చంద్రబోస్

అందరూ సంఘటితమై రాజమహేంద్రవరం అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఎంపీ పిల్లి సుభాస్ చంద్రబోస్ కోరారు. పేద ప్రజల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్లాలని, ఎక్కడా విభేదాలకు తావివ్వొద్దన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయ రంగ ప్రవేశం చేశానని, వైద్య రంగంలోనే కాకుండా రాజకీయంగా ప్రజలకు సేవలందించాలనే ఆశయంతో వచ్చానని, అందరూ తనకు తోడుగా ఉండాలని ఆయన కోరారు.

త్వరలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

త్వరలోనే రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నగరంలో నిర్వహించనున్నట్టు పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. పార్టీ శ్రేణులమంతా కూర్చుని సాధక బాధలు చర్చించుకుందామన్నారు. త్వరలోనే సమావేశం ఎక్కడ, ఎప్పుడు అనేది తెలియజేస్తామని అడపా శ్రీహరి తెలిపారు. సమావేశంలో ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాలిక శ్రీను, పిల్లి శ్రీనివాస్, మజ్జి అప్పారావు, టీకే విశ్వేశ్వరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్‌ను అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు శ్రీకాంత్. చిత్రంలో సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: జేగురుపాడు జీవీకే ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చెరుకూరి నాగసాయిరాం రూ.60వేల విలువ చేసే ఫర్నిచర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్వాలారపు శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా వస్తువులను పాఠశాలకు అందించారు. నాగసాయిరాం సొంత నిధులతో పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే బల్లలు, కుర్చీలు తదితర వివిధ రకాల వస్తువులను అందించడంపై శ్రీకాంత్ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సోమవారం ఘనంగా సత్కరించారు. అనంతరం జేగురుపాడులోని జానర్దనస్వామి ఆలయాన్ని సందర్శించారు. అలాగే మండల కేంద్రమైన కడియంలో షిర్డిసాయిబాబా ఆలయాన్ని కూడా శ్రీకాంత్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్ చంద్రస్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన యువతిని ఆసుపత్రిలో చేర్పించిన ఎంపీ



యువతిని ఆస్పత్రికి తరలించే పనిలో ఉన్న ఎంపీ భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయిన ఓ యువతికి వెంటనే వైద్య సదుపాయం కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్. వివరాల్లోకి వెళితే.. రాజమండ్రి నగరంలోని జేఎన్ రోడ్డు శ్యామలా నగర్ మూడు రోడ్ల సెంటర్ రామాలయం వద్ద తన స్నేహితురాలితో కలిసి బైక్‌పై వెళుతున్న యువతి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయమైంది. వెంటనే జనం గుమిగూడారు. ట్రాఫిక్ నిలిచిపోయింది. సరిగ్గా అదే సమయంలో అటుగా వెళుతున్న ఎంపీ భరత్ వెంటనే తన వాహనాన్ని ఆపించి ఏం జరిగిందో తెలుసుకుని అక్కడకు వెళ్లారు. అప్పటికే యువతి తలకు గుడ్డకట్టి ఉంది. పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్న తన స్నేహితురాలి తండ్రికి క్యారేజ్ ఇవ్వడానికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక కూర్చున్న ఆమెకు ఫిట్స్ రావడంతో బైక్‌పై నుంచి పడిపోయినట్టు చెబుతున్నారు. తలకు గాయమైన యువతిని ఎంపీ భరత్ ఆసుపత్రిలో చేర్పించారు. తొలుత నవీన్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువతి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఆ ఇద్దరి యువతులది నగరంలోని బుచ్చయ్య నగర్. ఎంపీ భరత్ చేసిన సాయానికి అందరూ అభినందించారు.

లా కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వీరవల్లి లా కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి విద్యార్థులకు అంతర్జాతీయ న్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు, ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్ విధుల గురించి వివరించారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ శిక్ష స్మృతి (ఐ.పి.సి) లోని వివిధ సెక్షన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, భరణం చట్టం, 2007, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి సమగ్రంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ జి.వాత్సవ్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన, యుద్ధ నేరాలు, మారణ హోమాల నుంచి ప్రజలను పరిరక్షించేందుకు, శాంతి భద్రతల కోసం చేసిన చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి న్యాయ కళాశాల ప్రిన్సిపల్ పి.సత్యనారయణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లెప్రసీ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం



కంబాలపేట యూపీహెచ్‌సీలో పరిశీలిస్తున్న నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ యాస్మిన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లెప్రసీ వ్యాధి నిర్మూలనకు చేపట్టిన ఇంటింటి సర్వేలో ప్రజలకు వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించాలని, తద్వారా కుష్టు రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దవచ్చని నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాస్మిన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కంబాలపేట, యూపీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు.

కేసు డిటెక్షన్ క్యాంపెయిన్, సర్వే చేస్తున్న విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె లెప్రసీ సర్వేలో ప్రజలకు అవగాహన కల్పించే ఫ్లిప్ కార్డ్, పోస్టర్స్ మొదలగు ఐఈసీ మెటీరియల్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనుమానిత కేసులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం యూపీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. జిల్లా లెప్రసీ, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఎస్.వసుందర మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న సర్వేను ఎప్పుడికప్పుడు పర్యవేక్షణ చేసి, సర్వే టీమ్‌లకు సూచనలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎంఓ డాక్టర్ పి.లక్ష్మీదేవి, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డీపీయంఓలు శివకుమార్, ఈశ్వర రావు, డేవిడ్ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద సమయంలో అండగా..

వలంటీర్లకు వందనం



ఆల్కాట్‌తోటలో మత్స్యకారులకు భోజనాలు పెడుతున్న వలంటీర్లు (ఫైల్)

గత ఏడాది జూలైలో గోదావరి వరదల సమయంలో నది మధ్యలో నివసించే మత్స్యకారులను ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఆశ్రయం కల్పించారు. ఆ సమయంలో 45, 46, 47 వార్డు సచివాలయ వలంటీర్లు మత్స్యకారులకు భోజనం, టిఫిన్లను స్వయంగా వడ్డించి సేవలు అందించారు. ఇలా వారం రోజుల పాటు విస్తృతంగా సేవలు అందించి అందరి మన్ననలు అందుకున్నారు. కరోనా సమయంలోను వలంటీర్లు సేవలు వెలకట్టలేనివి. కరోనా పేషెంట్లకు దాతలు ఇచ్చిన గుడ్లు, ఇతర ఆహార పదార్థాలను సైతం వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అందజేశారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)

నరసాపురం వెళ్లి.. పింఛన్ అందజేసి



నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో జనార్దనరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్‌కుమార్ (ఫైల్)

రాజమహేంద్రవరం కొండావారివీధికి చెందిన కోమాటి జనార్దనరావుకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ ఈదలాడ సురేష్‌కుమార్ ప్రతి నెలా అందించేవాడు. 2021 సెప్టెంబరులో జనార్దనరావు అనారోగ్యానికి గురై నరసాపురంలోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. అక్కడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ నరసాపురం వెళ్లి ఫింఛన్ అందించారు. అంతేకాకుండా ఆయన ఇబ్బంది పడకుండా నరసాపురంలోని వలంటీర్‌కు జనార్దనరావు పింఛన్‌ను మ్యాపింగ్ చేసి ప్రతినెలా అక్కడే అందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు నరసాపురంలోనే పింఛను అందుకుంటున్నారు.

పింఛనే నా జీవనాధారం

వలంటీర్ సురేష్‌కుమార్ అందించిన సేవలు వెలకట్టలేనిది. నేను నరసాపురం వెళ్లినా ప్రతి నెల పింఛను అందుకుంటున్నానంటే వలంటీర్ దయ. పింఛను నిలిచిపోకుండా ఇక్కడ వలంటీర్‌కు చెప్పి ఇప్పిస్తున్నాడు. నా జీవనాధారమైన పింఛనను అందిస్తున్నాడు. ఎంతో మేలు చేశాడు.

– కోమాటి జనార్దనరావు, వృద్ధాప్య పింఛన్‌దారుడు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ భరత్



ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న పట్టపగలు వెంకటరావు, తోట సుబ్బారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఇన్స్టాలేషన్ నూతన కార్యవర్గం (2023-24) ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక సరస్వతీ ఘాట్ రోడ్డు బొమ్మన రామచంద్రరావు చాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై రోటరీ క్లబ్ సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీ భరత్‌ను జ్ఞాపిక, శాలువాతో డాక్టర్ పట్టపగలు వెంకట్రావు, నూతన పాలకవర్గ అధ్యక్షుడు తోట సుబ్బారావు సత్కరించారు.

రోటరీ నూతన పాలకవర్గం

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేసింది. క్లబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ పట్టపగలు వెంకట్రావు, అధ్యక్షుడిగా తోట సుబ్బారావు, కార్యదర్శిగా నూనె సాయిబాబా ప్రమాణ స్వీకారం చేశారు. రోటేరియన్ ఇమ్మిడియట్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్ విఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పరవస్తు సత్యగోపీనాథదాస్ ప్రభూజీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి (ఐడబ్ల్యూసీ) అధ్యక్షురాలు డాక్టర్ కే ఝాన్సీ, కార్యదర్శి కే రాణి, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, యూరాలజిస్ట్ డాక్టర్ టీవీ నారాయణరావు, రాజమండ్రి ఆర్ట్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్నచౌదరి, రాకా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, స్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

అదనపు కమిషనర్ సత్యవేణి



స్పందన అర్జీలు స్వీకరిస్తున్న సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 13 అర్జీలు అందాయి. ఈ స్పందనకు వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అదనపు కమిషనర్ సత్యవేణి తెలిపారు. జగనన్న సురక్షలో ఇంటింటి సర్వే ద్వారా ప్రజల వ్యక్తిగత అర్జీలను స్వీకరించి గ్రామ సభలో వాటిని అందజేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, ఎంహెచ్‌వో వి.వినూత్న ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో....

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అడిషనల్ ఎస్పీ(లాఅండ్‌ఆర్డర్) ఎం.రజని నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 అర్జీలు అందాయి. అందులో సివిల్ 10, ఫ్యామిలీ గొడవలు రెండు, ఇతర సమస్యలు 13 వచ్చాయన్నారు. సౌత్ జోన్ పరిధిలో నాలుగు, ఈస్ట్ జోన్ పరిధిలో మూడు, సెంట్రల్ జోన్ పరిధిలో ఏడు, కొవ్వూరు డివిజన్ పరిధిలో ఆరు ఫిర్యాదులు ఉన్నాయని ఏఎస్పీ రజని తెలిపారు. ఈ ఫిర్యాదులపై వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపించి, సమస్యలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కారిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ జీవన నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని డైట్ వైస్ ప్రిన్సిపాల్ కె.వి.సూర్యనారాయణ అన్నారు. సోమవారం బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో మ్యాజిక్ బస్ సంస్థ, ఎస్‌సీఈఆర్‌టీ సంయుక్తాధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ కె.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఆటల ద్వారా జీవన నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను, సమస్యలు అనుగుణంగా తమ జీవితాన్ని చక్కదిద్దుకుని మంచి జీవితాన్ని పొందే అవకాశం ఉందన్నారు. కౌమరదశ విద్యార్థులను విద్యా సంవత్సరాలలో ఎంపిక చేసిన జీవననైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ డీఎస్‌వీ సత్యనారాయణ, మ్యాజిక్ బస్ స్టేట్ ట్రైనింగ్ మేనేజర్ డేవిడ్ రేవంత్, రీజనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, డైట్ లెక్చరర్లు పాల్గొన్నారు.

రైతుల కష్టం తీర్చిన సీఎం జగన్

మధురపూడి: సర్వీసు ఈనాం భూములపై సర్వ హక్కులు కల్పించడంతో కోరుకొండకు చెందిన భూముల సమస్యకు పరిష్కారం లభించిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి 1.68 లక్షల ఎకరాల భూములను తొలగించడంతో కోరుకొండ భూములకు విముక్తి లభించిందన్నారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రైతుల సమస్య తీరిందన్నారు. ఇందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. 2013లో ఈనాం భూములన్నింటినీ 22(ఏ)లో పెట్టారన్నారు. దేవదాయ భూములతో పాటు ఈ భూములను చేర్చారన్నారు. దీంతో భూములున్నప్పటికీ వాటిపై రైతులకు హక్కులేకుండాపోయిందని, దీనివల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా కోరుకొండ వచ్చిన జగన్‌కు సమస్యను వివరించగా పరిస్కారానికి కృషి చేస్తానన్నారని, అన్న మాట ప్రకారం సర్వీసు ఈనాం భూములపై సర్వ హక్కులు కల్పించారన్నారన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ మీట్‌లో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో-కన్వీనర్ గణేశుల పోసి, కోరుకొండ పంచాయతీ ఉప సర్పంచ్ నేతుల చిన్ని, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.